


శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

# శ్రమతో సేవ – సేవతో కైవల్యం మాసపత్రిక


వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్
ఎడిటర్: గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

నేపథ్యం:చూచి నేర్చుకో

సంపుటి: 02 సంచిక:7
19-February-2019


శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యము గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి వాచా బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

**గమనిక** : ఎవరైనా ఈ e-magazine లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

**శ్రీ సద్గురు దర్గాస్వామి మరియు సుబ్బరామయ్య సార్ ప్రవచనం**

శ్రీ దర్గా స్వామి వారి ప్రవచనం : http://saimastersevatrust.org/Speeches/DargaSwami_Speech.mp3

స్వామి గురు పౌర్ణమి నాడు భక్తులను ఉద్దేశిస్తూ 'సద్గురువుని చూడాలంటే ఆయన గుణగణాలను ధ్యానం చేయాలని, ఆయన కీర్తులను జిహ్వ మీద (చెప్పుకోవటం) ఉంచి, జిహ్వ చాపల్యం లేకుండా ఉంటే వాక్శుద్ధి వస్తుంది" అని చెప్పారు.

శ్రీ సుబ్బరామయ్య సార్ నిజమైన మహాత్ముల గూర్చి చెబుతూ, శ్రీ దర్గా స్వామి వారి గొప్పదనాన్ని చివర లో (16వ నిమిషం నుండి) చెప్పి స్వామిపై కొందరికి గల అపోహలను తొలగించు సంభాషణలు, ఏమి చేస్తే స్వామి కృప కలుగుతుందో చెపుతున్నారు :
http://saimastersevatrust.org/Speeches/DargaSwami_TrueGuru_RagaDweshaNirmulanam.mp3

**సత్యం మాతా పితా జ్ఞాన ధర్మో భ్రాతా దయా సఖా| శాంతి: పత్ని క్షమా పుత్రో షడయతే మామ బాంధవా||**

## చూచి నేర్చుకో

శ్రీ దర్గాస్వామి వారు, నీలకంఠరావు పేట, నుండి మనం చూసి నేర్చుకోవలసిన వాటిలో కొన్ని ఇచ్చట స్మరించుకుందాము.

"ఎప్పుడూ మౌనంలో ఉంటారు. మాకు మంచీ చెడ్డా చెప్పుకుంటే ఎట్లా స్వామి?" అన్న సేవకులతో "చెప్పేదేముందయ్యా? చూచి నేర్చుకోండి" భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి అన్నారు. ఎక్కడో, ఎవరినో చూచి నేర్చుకునేదాని కంటే తన ఆచరణతో మనకు బోధించేందుకే మానవరూపం ధరించిన ఆ మహనీయుని (భగవాన్ శ్రీ వెంకయ్యస్వామిని) చూచి నేర్చుకోవడం ఉత్తమం గదా!"

– శ్రీ పెసల సుబ్బరామయ్య

పై చెప్పిన వాక్యం అందరి మహనీయులకు వర్తిస్తుంది. మన మధ్య 2019 ఫిబ్రవరి 8 వ తారీఖు మధ్యాహ్నం 4గం 45ని||ల వరకు భౌతికంగా ఉంటూ ఆ తర్వాత నుండి విశ్వ చైతన్యుడై మనల్ని నడిపిస్తున్న సద్గురు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి గారి జీవితం నుండి నేర్చుకోవలసిన ఎన్నో విషయాల నుండి కొన్ని ప్రస్తావించుకుందాం.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్న రీతి శ్రీ స్వామి వారి బాల్యం లోనే దేవతా స్తోత్రాలు నేర్చుకొని రోజు చదవటం, రోజు సాయంత్రం ధ్యానం చేయడం చేసేవారు. నిజానికి శ్రీ స్వామి వారి అమ్మగారు ధ్యానం

చేసిన తర్వాత నేయి రొట్టె, తేనె పెడతానని ధ్యానం అభ్యాసం చేయించారు. ఉన్నత విలువలతో తమ పిల్లలు పెరగాలని భావించేవారు కార్య రూపంలో ఎలా శిక్షణ ఇవ్వాలో దాని ఫలితంగా పిల్లల ఉన్నతికి సానుకూలత ఎలా కలుగుతుందో ఇచ్చట తెలుస్తుంది. ఈ విధంగా అభ్యాసం కావటం వల్లనే స్వామి భద్రావతి నది ఆనకట్ట ప్రాజెక్ట్ సూపర్ వైజర్ గా చేరిన తర్వాత కూడా సమయం తెలియనంత గా ధ్యానంలో ఉండేవారు. భగవంతుని పై నిజంగా మనస్సు నిలిపేవారికి సానుకూలత భగవంతుడే ప్రసాదించినట్లు వారి పై అధికారులు కూడా దానికి ఏమీ అనేవారు కాదు.

స్వామికి అంతర్వాణి రూపంలో గురువు, దైవం, పలకడం, దానిని వినే సామర్థ్యం చిన్నప్పటి నుండి ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ఉద్యోగంలో ఉండగా స్వామికి అంతర్వాణి ద్వారా "ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి మీ ఊరికి వెళ్ళు. ఇంకో ఉద్యోగం ఇస్తాము" అని సందేశం అవుతుంది. దానిని అనుసరించి స్వామి నడుచుకోవటం జరిగింది. అది దైవ సంకల్పం,దైవ వాక్కే అన్న విషయం కాలం నిరూపించడం గమనార్హం. ధ్యానం, భక్తి , సత్ సంస్కారాల ద్వారా జాగృతమైన శ్రీ స్వామిదైవ ఆదేశాన్నివిని నడుచుకోవటం ఎన్నో సంఘటనలలో చూడవచ్చు.

భగవంతుడు స్వామిని మనందరికీ లభ్యం చేయటానికి అన్నట్లు, ఎంతో ఉత్తమ సంస్కారాలు గల అమ్మయ్య ("రంగనాయకమ్మ" ) గారితో స్వామి వివాహం 1951లో జరిగింది. శ్రీ సాయినాధుడు ధ్యానంలో కనబడి అమ్మయ్య గారిని వివాహం చేసుకోమన్నారు. అడుగడుగునా గురువు అడగకనే వారిని చేయి పట్టుకుని నడిపించటం, అంతర్వాణిగా పలికి చేయించడం వారి పవిత్రతకు, నిష్కల్మషతకు గుర్తు. "వసుద్ధి చేసుకుంటే రెండక్షరాలు చాలు" అన్న శ్రీ వెంకయ్యస్వామి మాట విలువ తెలుపుతున్నారు.

వివాహమైన తర్వాత దైవదూత భార్యతో శారీరక సంబంధం నిషేధించగా, స్వామి అమ్మయ్య గారి మనోభావం గూర్చి ఆలోచించారే తప్ప, తన గురించి కాదు. దీనిని బట్టి వారికి అప్పటికే కామ లేశమైనా లేనట్లు తెలుస్తోంది. ఎట్టి తపస్సు చేయకముందే ఇంద్రియ విషయాలపై కోరిక, ఆశ లేని సంసిద్ధత కలిగి ఉండటం, అంటే సత్వగుణం సహజ సిద్ధం కావడం కాక మరేమిటి? అమ్మయ్య గారు కూడా అందుకు సంతోషంగా సహకరించడం ఆర్ష ధర్మంలో గల ఋషిపత్నుల జీవనాలను గుర్తుకు తెస్తుంది. మన శక్తి వంచన లేకుండా మనలోని కల్మషాలను తొలగించుకునే కృషి చేస్తే కానీ ఈ విధమైన గురుసేవా సంసిద్ధతకు కనీసం చేరువ కాలేము కదా! అలానే ఇంద్రియ విషయాల వైపే మళ్లని మనస్సు ఉండుటకు ఎంత శిక్షణ ఉండాలో ! వివేక వైరాగ్యాలను అభ్యాసం ద్వారా ఎంత దృఢ పరుచుకోవాలో ఎవరికి వారే తరచి చూచుకోవాలి.

స్వామి వారి తల్లి గారు 1953 లో మరణించిన తరువాత, మొదట శ్రీ సాయినాథుని పై కోపంతో అలిగినా, స్వామి వారి శరణాగతి, భక్తి భావాలను అనుసరించి బాబా కలలో కనబడి మధ్యవర్తి ద్వారా “వారి తల్లి వచ్చిన పని పూర్తయింది, కాబట్టి తీసుకుపోయానని” చెబుతారు. ఇది బిడ్డ అలిగితే తండ్రి ఊరట కలిగించినట్లు ఉంది. ఇంతటి శరణాగతి సాధించే ప్రయత్నం చేయమని బోధిస్తున్నట్లు ఉంది.

త్వరలో స్వామి దృష్టి తపన దైవాన్వేషణగా, ఆత్మాన్వేషణగా మారింది. తీర్థయాత్రలు, తరువాత Sholingar నరసింహ క్షేత్రం లో సేవ చేసినా స్వామి మనస్సు సమాధాన పడ లేదు. ఇద్దరు మహాత్ములు స్వప్న దర్శనమిచ్చి “మాకు దీపం పెట్టు నిన్ను పోషిస్తాము” అని చెబుతుండేవారు. ఈ దైవాదేశాన్ని పాటించే యత్నంలో రాయచోటి దీవానే సాహెబ్ దర్గా వద్దకు వెళ్లి ఉండగా ఆ స్వామి (దీవానే సాహెబ్) భౌతిక దర్శనం ప్రసాదించి, నీలకంఠ రావు పేట దర్గాల గూర్చి తెలిపి, అచ్చటకు వెళ్ళమన్నారు, అచ్చట స్థలం నిశ్చయం కోసం ప్రార్థిస్తూ రెండు సాంబ్రాణి కడ్డీలు చేతుల్లో పెట్టుకొని అవి ఆ ప్రదేశానికి వెళ్ళగానే వెలగాలని అనుకుంటే అట్లే అనుభవం కలగడం జరిగింది. దైవాదేశం, గురువాక్యం, ఆత్మనిశ్చయం అన్నీ స్వామికి (గురుస్థానాన్నీ ) కోరిన అనుభవాన్నీ ప్రసాదించడంతో స్వామి మనస్సు ఇదే గురుస్థానం అని, నివాసయోగ్యం అని సమాధానపడటమే కాక, మనందరకు 60 సంవత్సరాలు అచ్చట లభ్యమయ్యారు.

శ్రీ స్వామి ఈ విషయంలో ఆచరించిన రీతి విశేష మన ప్రయత్నము, ఆత్మ నిశ్చయంతో గురుసేవకు, గురు కృపకు మనం సంసిద్ధము, పాత్రులము అవ్వాలి.

1958లో దర్గాల వద్ద స్వామి దీపం పెట్టడం ,ఆరాధించటం మొదలైనవన్నీ మొదటనుండే పూల బాటలా సాగలేదు. స్వామి వైశ్యులు- హిందువులు, అయి దర్గాల వద్ద దీపం పెట్టడం, ఉరుసు జరపటం మొదలగునవి చేస్తుండడం, అల్ప సంస్కారాలు గల మనకు సమాధాన పడకపోవటం సహజమే! శ్రీ సాయి వలనే స్వామి కూడా ఈ పరిస్థితి నుండి తప్పుకోచూడలేదు. భగవంతునికి, గురువుకు సంపూర్ణ శరణాగతి అంటే ఏమిటో, అలాంటి శరణాగతి ఉంటే ఎంతటి పరిస్థితి అయినా ఎంత అనుకూలం అవుతుందో స్వామి ఆచరణ, అప్పటి సంఘటనలు తెలుపుతాయి.

ఒకసారి స్వామి దర్గాల వద్ద సేవించడం నచ్చని వారు స్వామి నిద్రిస్తున్నారని తలచి మంచంతో సహా స్వామిని ఎత్తుకుపోతారు. ఇది తెలిసినా కానీ స్వామి ప్రశాంతంగా పూర్ణ శరణాగతితో దర్గాలలో వారు చూసుకుంటారని నిశ్చింతగా ఉంటారు. వారికి తమపై పాములు పడుతున్నట్లు అనుభవం కావటంతో భయం తో స్వామిని మరలా ఎచ్చట ఉన్న వారిని అచ్చటనే పెడతారు.

మరోసారి ఇష్టం లేని కొందరు ఎన్నో అవాంతరాలు సృష్టిస్తుంటారు. ఉరుసు సమయంలో ఒకడు అమ్మయ్య గారిని, స్వామిని బాగా తూలనాడుతూ మాట్లాడతాడు. అప్పుడు ఈ ఇరువురు దివ్య దంపతులు


గురువుకు శరణాగతి చేసి ఉండడం తో అతనికి దర్గాలోని మహాత్ములు  కాలుతో కొడితే స్పృహ కోల్పోయి, లేచిన తర్వాత భయం, బుద్ధి వచ్చి శరణు వేడి క్షమాపణ చెబుతారు. గురుసేవలోఎంతటి శరణాగతి ఉండాలో, ఉంటే ఎంతటి రక్షణ ఉంటుందో ఈ దివ్య దంపతులు తెలుపుతున్నారు.

శ్రీ స్వామి అమ్మయ్య గారు అరణ్యంలోకి కట్టుబట్టలతో వచ్చి  గురుసేవలో అన్నానికి సైతం ఇబ్బంది అయినా దీక్ష వహించి నిలిచారు.  స్వతహాగా లక్షాధికారులు అయినా ఇరువురు గురుసేవకై వారి ధనం మొత్తం వెచ్చించడమే కాక, ఆర్థికంగా అన్నానికి ఇబ్బంది అయినా  సంతోషంగా ఓరిమితో భరిస్తూ గురుసేవలో లోపం రానివ్వకుండా ఉండటం గమనార్హం. గురు ఆదేశాన్ని అనుసరించి జీవిస్తూ ఎందరికో వారి సంశయాలు, సమస్యలు, కోర్కెలు,  ఆర్తి తీర్చుటకు స్వామి ప్రశ్నలు చెప్పేవారు. శ్రీ అవధూత లీలలో చెప్పినట్లు స్వామి ప్రశ్నలు చెప్పే విధానం కూడా ఎదుటి వారి సంస్కారాన్ని, పరిణితిని, సందర్భాన్ని అనుసరించి వివిధ రీతులలో ఉండేది. కొందరికి ఏ సమయంలో నైనా,  ఫోన్లో కూడా సహజంగా మాట్లాడుతూనే భవిష్యత్తులో జరగబోయే విషయాలు చెప్పి నివారించడం, ఆశీస్సులుగా కోరనివి కూడా ప్రసాదించడం ఉంటే, మరికొందరికి నిర్ణీత రోజుల్లో, నిర్ణీత సమయంలో,  నిర్ణీత పద్ధతిలో మాత్రమే చెప్పటడేవి. కొందరికి అడగకనే స్వామి గడగడ వారి పూర్వ, ప్రస్తుత చరిత్రలు చెబుతూ వారి శ్రేయస్సుకు ఏమి చేయాలో చెప్పి చేయించడమో, అనుగ్రహించడమో ఉంటే, మరి కొందరికి మాటలు రావట్లేదని చెప్పడము ఆగ్రహించడము ఉండేది! “వాళ్ళు ఉండే దాన్ని బట్టి గదయ్యా మనం ఉండేది” అన్న స్వామి మాటకు ప్రత్యక్ష అనుభవం స్వామి వద్ద వస్తుంది.

స్వామి చరిత్రలో ఉన్న సంఘటనలలో చనిపోయిన వారిని తిరిగి బ్రతికించ గల స్వామికి ”చచ్చిబూడిదైన రమ్మంటే వచ్చేదేగదయ్యా” అన్న శక్తి గల స్వామికి, మన సంశయములు, కోరికలు, ప్రశ్నలు తీర్చడానికి ఏ ప్రత్యేక ప్రయత్నం అవసరమవుతుంది ! ఇది గుర్తించి శ్రీ స్వామి వారి యొక్కపూర్ణ దివ్య స్థితిని,  అంతటా ఉన్న సత్యము,  భగవంతునితో ఒకటిగా ఉన్న చైతన్య స్థితిని, గుర్తించి నడుచుకుంటే తగురీతిన, అప్పుడు-ఇప్పుడు శ్రీ స్వామి వారి కృప మనకు తప్పక అనుభవం అవుతుంది, అని ఎందరో అనుభవాలు “ దైవంమానుష రూపేణా” పుస్తకం లోనివి తెలుపుతున్నాయి.

ఇంతటి శ్రీ స్వామివారు 60 సంవత్సరాలు (1958 - 2018) దర్గాల వద్ద ఆర్తులు, అర్థార్థులు, ముముక్షువులందరికీ ఏ తారతమ్యం లేకుండా ధనము, లాభం వంటి ఎట్టి ప్రయోజనాలను ఆశించక అతి సులభంగా లభ్యమవుతున్న వారి దివ్య స్థితి, ఎందరికో కలిగిన దివ్య అనుభవాలలో వ్యక్తమవుతున్నా, వారి జీవన విధానం సాధారణంగా ఉంటూ, ఉత్తమ సాధకులకు కూడా ఆదర్శంగా ఉండటం మనం  చూసి నేర్చుకోవాలి. రోజుకు ఒక్క గ్లాసు కొబ్బరి నీళ్ళు, పాలతో మాత్రమే నివసించే వారి యోగ సాధన, నియమ


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

పాలన అధ్భుతమే అయినా, వారి గురుసేవా నిరతి, నిరాడంబరత లోని తృప్తి వారి దివ్యత్వాన్ని తెలుపుతున్నాయి.

శ్రీ స్వామి దర్గాలోని మహాత్ములను సేవించటం ఆరంభించిన నాటి నుండి స్వామి నిత్యకృత్యం దాదాపు 50 సంవత్సరాల పాటు అలాగే సాగింది. రోజు దర్గాలలోను, కొన్ని గురు స్థానాలలో దీపం పెట్టడం, నాలుగు పూటల ఆరతులు, రోజు ( గురు,శుక్ర వారాలలో తప్ప) వచ్చిన వాళ్ళ ఆర్తి తీర్చడం, ప్రశ్నలు చెప్పటం ఇలానే ప్రకృతిలోని సూర్యచంద్రుల గమనంలా, సాయినాధుని జీవనంలా నిర్దిష్టంగా సాగేది. స్వామి హారతులు చేసే విధానం కూడా చిత్రంగా ఉండేది. ఉదయమే నాలుగు గంటలకు సాయినాధుని మందిరంలో మొత్తం శుభ్రం చేయటం, హారతికి అన్ని సమకూర్చడం దాదాపు ఒక గంట పైగా స్వయంగా చూసుకునేవారు. ఆరతి సమయం కంటే స్వామి చేసే ఈ సేవా సమయం ఎక్కువ ఉండేది అంటే అతిశయోక్తి కాదు! ఆ పనుల పట్ల వహించే శ్రద్ధ కూడా అలానే ఉండేది ! “శ్రమతో సేవ - సేవతో కైవల్యం” అని శ్రీ సుబ్బరామయ్య సార్ కు శ్రీ వెంకయ్యస్వామి చూపినట్లు దర్గాస్వామి చేసే ఈ శ్రమతో సేవకు తోడు సామాజిక సేవ కూడా ఎంతో శ్రద్ధగా చేసే వారు, ఎందరితోనో చేయించేవారు. దర్బారు విద్యాలయం ఉచిత విద్యతో నిర్వహించడం, ఎందరికో పేద విద్యార్థులకుపై చదువులకు ధనం ఇవ్వటం, మందిర నిర్మాణాలు, పునరుద్ధరణలు గొలగమూడిలో కళ్యాణ మందిర నిర్మాణం ఇలా స్వామి చేసే భౌతిక సహాయం కూడా ఎన్ని విధాలో ! ఎందరికో !

స్వామి శ్రద్ధగా నిర్ణీత కాలానికి చేసే ఆరతులు అంతటి సిద్ధ మూర్తి అయిన స్వామికి అవసరం ఉన్నా, లేకున్నా ఇవ్వడం, మనకు నిత్య ప్రార్థన, దానికి వెచ్చించే కాలం మార్చక శ్రద్ధతో ఇమ్మని, అది ఉత్తమ సాధన కు మొదటి మెట్టు అని సూచిస్తున్నాయి. ఉదయం సాయంత్రం ఆరతి తరువాత భజన చేయించేవారు. పారాయణ చేయించటం, స్వామి వచ్చిన భక్తులను అనుసరించి మాట్లాడటం, బోధన కూడా జరిగేది. సత్సంగం యొక్క గొప్పదనాన్ని స్వామి ఇలా ఆచరించి చూపారు. స్వామికి నిజమైన భక్తులం మనం కావాలి అంటే నిత్య సేవ, ప్రార్థన, ఆరతి, సత్సంగం, భజన మన జీవితంలో, రోజులో భాగాలుగా ఎలా అవ్వాలి? అనేది స్వామిని చూచి నేర్చుకొని, ఆచరించాలి.

స్వామిని ఒక భక్తుడు ‘స్వామీ! మీకు మేము ఏమి చేస్తే తృప్తి కలుగుతుంది?’ అని ప్రశ్నిస్తే ” నీలో ఆడే ప్రాణశక్తి నాలోనూ, అందరిలోనూ ప్రాణ శక్తిగా ఉంది (ఆడుతోంది). అది నిరంతరం (మరపు లేకుండా) గుర్తించి, ఆ గుర్తుతో ( భగవంతుడు అన్ని రూపాలలో ఉండి అంతటా ఉన్నాడని మన మనస్సు తో తెలుసుకుంటూ, ఉన్నాడు అన్న గుర్తుతో) నిరంతరం నడుచుకుంటే తృప్తి అవుతుందని, ఆ అనుభవం పొందే ప్రయత్నం, అభ్యాసం చేయమని” చెప్పారు. శ్రీ స్వామి ఆచరించిన రీతి నిత్య కర్మానుష్ఠానము, మనకు భగవంతుడు

అనుగ్రహించిన పనిని వారి సేవగా ఆచరిస్తూ, ఈ ఎరుకతో జీవించ గలిగితే స్వామిని తృప్తి పరచి వారి కృప పొందటం తధ్యం.


శ్రీ స్వామి ఈ గురుసేవ దీక్షలో భాగంగా తనను ఆశ్రయించి వచ్చిన దీనుల ఆర్తి బాపే రీతి అత్యద్భుతం. అది నిరంతరం కొన సాగుతుందనే చెప్పవచ్చు. 2010 సంవత్సరం నుండి 2015 వరకు వయస్సు వల్ల స్వామి నడుము ఎంతో వంగి పోయినా నిత్యక్రమం పై, గురుసేవ పై శ్రద్ధ వహించడం గుర్తించాలి. శారీరక శ్రమను పరిస్థితిని లెక్క చేయక గురు సేవ, నియమ పాలనలో సాగటం స్వామికే చెల్లింది. అలానే చివరి రెండు సంవత్సరములు నిరంతరం ఒక్క సోఫా మీద, కనీసం మరో ప్రక్కకు తిరగటం కూడా చేయక పడుకొని ఉన్నా, గురుసేవగా ప్రశ్నలు చెబుతూ ఉండేవారు. తనను అర్థించి, ఆశ్రయించి వచ్చిన వారిని గురు రూపాలుగా భావించి గురుసేవగా వారి ఆర్తిని తీర్చడం స్వామి జీవనంలోనే ప్రత్యేకంగా చూడగలం. వారు ఆదేశిస్తే సకల సౌకర్యాలు సమకూర్చ గల వారెందరు ఉన్నా అంతటి నిరాడంబర జీవనం గడపటం వారి యోగసిద్ధికి , సాధకులకు ఆచరణను ప్రేరేపించడానికి గుర్తు ఏమో! సమాధి అయిన 32 గంటల తర్వాత కూడా జీవకళతో ఉట్టి పడుతూ, ఏ మాత్రం ఉబ్బక ఉన్న ఆ యోగి శరీరం, స్వామి యోగ స్థితికి గుర్తు కాగా, వారి నిరంతరం గురు సేవ మనకు ఆచరణీయం, మార్గదర్శనం.

మత సామరస్యానికి మరో పేరు దర్గాస్వామి: స్వామి దర్గాల దగ్గరకి వచ్చిన తర్వాత దర్గాలో ఉన్న మహనీయులను సేవించి మహనీయలు అయ్యారు. ఆ మహనీయులు స్వామిని ముస్లింగా మారాలి అని చెప్పిన దాఖలాలు స్వామి ఏనాడూ ప్రస్తావించలేదు. స్వామి ఆ ముస్లిం మహనీయులను, హిందూ దేవతలను సమానంగానే సేవించారు. అంతేగాక స్వామి హిందువులను, ముస్లింలను సమానంగా చూసారు. అంతేగాక ఎవరి ఇంటి కులదైవాన్ని వారు పూజించాలి అని చెప్పేవారు. అంతేగాక హిందువులు, ముస్లింలు దర్గాల్లో జరిగే అన్ని పండుగలకు ఎలాంటి బేదాభిప్రాయం లేకుండా హాజరవుతారు. మరియు స్వామి జనవరి 1వ తేదీన కేకు కోసి క్రిస్టియన్ ల నూతన సంవత్సర పండుగను కూడా జరుపుతారు.

నిరంతర గురు సేవ చేయాలి అనేది స్వామి జీవన సందేశం: స్వామి సమాధి అవటానికి రెండు రోజుల ముందర దాకా (అంటే 89 సంవత్సరాల) స్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సమస్యలకు సలహాలిచ్చి, వారిని సమాధాన పరచి పంపించారు. స్వామి తనకు ఓపిక లేదు అందువలన ఎవరితోనూ మాట్లాడకూడదు అనుకుంటే స్వామిని అడిగేవారు లేరు. కానీ స్వామి వచ్చే అందరి భక్తులలో తమ గురువునే చూసుకుంటూ వారిని సేవించుకుంటున్నారు. సద్గురు సేవే మొదటిమెట్టు, చివరి మెట్టు అని స్వామి బోధిస్తున్నట్లు ఉంది.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

# శ్రీ సుబ్బరామయ్య సార్ భక్తులకు వ్రాసిన లెటర్లు

గొలగమూడి
16-03-1999

పూజ్య గురుబంధు శ్రీమతి లక్ష్మక్క గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. ఉభయకుశలోపరి. మీ సత్సంగం తరఫున శ్రీ దర్గాస్వామి వారితో మీ అందరి అనుభవములు వ్రాసి పంపినారు. చాలా సంతోషము. శ్రీ దర్గా స్వామి వారిని చూచే భాగ్యము నాకు కలుగలేదు. శ్రీ స్వామి వారి దయ ఎలా ఉంటే అలాగే జరుగుతుంది. మీతో వారు మాట్లాడిన మాటలన్నీ ఒక ఎత్తైతే "పిల్లి పిల్లను పట్టుకోవడం" అన్నమాట ఒక ఎత్తు. ఇందులో మనము పిల్లల వంటివారము. ఆ సద్గురుమూర్తి పిల్లిలాంటి వారు. వారు మనలను ఎంతో జాగ్రత్తగా పట్టుకొని గమ్యం చేరుస్తున్నారు. గనుక మనకెలాంటి చింతలేదు. మన కర్తవ్యమొక్కటే - కదలకుండా ఉండడమే. ఆ సద్గురుమూర్తి క్షేమంగా మనలను గమ్యం చేర్చేందుకు అవకాశమివ్వడమే. ఆచరణకు ముందు మన హృదయంలో అలాంటి మార్పు జరగాలి గదా? ఆ మార్పు తెచ్చే భాధ్యతే శ్రీ గురురాయునిది. మనకు తెలియకుండానే మన హృదయంలో అలాంటి మార్పు తెస్తారు. మనకు జరిగే సన్నివేశాలన్నీ "<u>మన మంచికే సద్గురు మూర్తి జరిపిస్తున్నారు</u>" అన్న ఎరుక ఏ మారకుండా మనకు వ్యతిరేకంగా ఉన్నవారికి కూడా కృతజ్ఞతా భావంతో ఉండాలట. ఎందుకంటే ఆ సన్నివేశం ప్రస్తుతానికి మనకు వ్యతిరేకంగా మన దృష్టిలో ఉండవచ్చు. కానీ శ్రీ సద్గురు మూర్తికి అది మన మంచికేనని చక్కగా తెలుసు గనుకనే ఆ సన్నివేశం జరుగనిస్తున్నారు. పిల్లి తన పిల్లను పట్టుకొని కొత్త స్థలానికి చేర్చేటప్పుడు ఆ పిల్లకు ఎంతో అసౌకర్యంగా బాధగా కూడా ఉంటుంది. కానీ ఆ పిల్లి క్షేమాన్నే దృష్టిలో పెట్టుకొని తల్లి అలా చేస్తుంది. గనుక తమకు నేను చెప్పనక్కరలేదు. తన కృపచెప్పబడ్డ ప్రతి పైసాను భగవంతుని చేర్చే బాధ్యత శ్రీ సాయినాథుని భుజస్కంధాలపై ఉంది. ఆచరణను అనుభవం ద్వారా తేవచ్చు. మాటలు చెప్పి మన నడవడి మార్చవచ్చు. మాటలకందని విధంగా దృక్‌దీక్షతోనే మనలో మార్పుతేవచ్చు. ఏది ఏమైనా శ్రీ గురురాయుని చేతిలో కీలుబొమ్మల వలె ఆడడం తప్ప మనకు స్వేచ్ఛలేదని గుర్తించి మనకు నలుమూలల నుంచి వచ్చే సలహాలు శ్రీ గురుమూర్తి మనపై ఎనలేని దయలో పంపినవేనని మన సాధనకు పనికి వచ్చే సూచనలు సలహాలు పాటిస్తుంటే క్షేమంగా గమ్యం చేరుతాము. వివేకం పెంచుతారు. సర్వం చూస్తారు. లౌకిక, ఆధ్యాత్మిక బాధ్యతలు మనకేమీ లేవు. మన బాధ్యతలన్నీ వారివే.

నీ పాదాల చెంత చేరాను. నా పై కరుణించి గమ్యం చేర్చు తండ్రీ అని మాత్రం నమస్కరిస్తు పఠన, మనన, విధి ధ్యానలు చేస్తుంటే సర్వం వారు ఒనగూర్చుతారు.


మనం వారి మాటలు అర్థం చేసుకున్నా చేసుకోకపోయినా ఆ విశ్వరూపుడు మనలో ప్రేరణ పెట్టి మనలో అవసరమైన మార్పు తెచ్చి తీరుతారు. మనం రైలు track పైన ఉంటే గమ్యం చేరడం తధ్యం. మన బోగీలు పట్టాలు తప్పితే మరుక్షణమే accident, గమ్యం చేరలేము.

శ్రీ గురుమూర్తి మనకు తగు ఆచరణ 000000000 మార్పు తీసుకు రావాలని ఆశిస్తూ

నమస్కారములతో
మీ
పె.సుబ్బరామయ్య

మర్కటకిశోర న్యాయం కాకుండడమే మన అదృష్టము. మర్కట కిశోర న్యాయంలో కోతిపిల్ల తల్లిని పట్టుకోవాలి గదు. గనుక పిల్లకోతికి బాధ్యత ఉంది. మీకెలాంటి బాధ్యతలేదు చాలా సంతోషము.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

గొలగమూడి
22-09-1994

పూజ్యగురు బంధువు శ్రీమతి D. నాగమణి గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. శ్రీ దర్గా స్వామి వారు "మీకు దత్తానుగ్రహం ఉన్నది" అని అన్నారు. గనుక అది గొప్ప ఆశీర్వాదము. ఆ ఆశీర్వాదముతో మనం గర్వించకుండా తగు కృషి చేస్తుంటే వెయ్యి రెట్లధికంగా వారి ఆశీస్సులు మనకనుభవమవుతుంటాయి. వారు నిత్య నిరంతరము మిమ్ములను స్మరించమన్న శ్లోకం గురువే సర్వాధికారి. అల్లామాలిక్ అన్న భావం మరచిపోకు ఏ మారకుండా.

శరీరం ఇంద్రియం ప్రాణం అర్థస్వజన బాంధవన్
ఆత్మదారాదికం నేస్తం సద్గురుభ్యోన్నివేదయేత్

అని సర్వం సద్గురుకర్పిస్తుంటే వారు మనలను తప్పక గమ్యం చేరుస్తారు. దత్తానుగ్రహముంది గనుక మన కృషి చక్కగా ఉండాలని భావం. ఆ అనుగ్రహం లేని వారు కృషి చేయలేరు చేసినా సరిగా చేయలేరు. గనుక పారాయణ, మననము, పూజ, జపం చేస్తూ ఉండండి. దత్తానుగ్రహం వేయిరెట్లుగా మీకే అనుభవమవుతుంది.

నమస్తే
పె.సుబ్బరామయ్య

గొలగమూడి
22-09-1994

పూజ్యగురు బంధువు శ్రీ చీమకుర్తి సుబ్బారావుగారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు.

శ్రీ దర్గాస్వామి వారు చెప్పినట్లు పుట్టలో పాలు పోస్తుండండి. కొంత పొలం పేస్తుపోయినా సరే ఆ పుట్టను తొలగించవద్దు. అందులోని వారు ఆ రూపంలో గొప్ప మహనీయులుండవచ్చు. ఆ విషయం దర్గాస్వామి వారిని అడిగి ఉంటే చెప్పి ఉండేవారు. ఒకరోజు శ్రీ రమణ మహర్షి గారు భక్తులను వెంట నిడుకొని ఆశ్రమంలో దూరంగా ఉన్న పుట్ట సమీపానికి పోగానే అందులో నుండి పెద్ద త్రాచుపాము బయటికి వచ్చి శ్రీ స్వామి వారి పాదాల దగ్గర నమస్కరించి తిన్నగా వెనుకకు వెళ్ళింది. వారు వెళ్ళాక శ్రీ రమణులు వారు గొప్ప మహనీయులు, ఆ రూపంలో ఇక్కడున్నారు, అని సెలవిచ్చారు. గనుక వారు చెప్పినవన్నీ పాటించండి. తప్పక ఆధ్యాత్మికముగా అభివృద్ధి ఉంటుంది.

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య


గొలగమూడి
22-09-1994

పూజ్యగురు బంధు వడిపల్లి నాగమణి గారికి నమస్కారములు. శ్రీ దర్గాస్వామి వారు నిత్యం ఉపదేశాలు చదవమని చెప్పినట్లు భావించండి. ప్రతినిత్యం కొన్నాళ్ళు చదివే సరికి అవి కంఠత అవుతాయి. మొదట మా అమ్మాయి చేత నిత్యం శ్రీ బాబాగారి సూక్తులు చదివించి వినేవాళ్ళము. కొన్నాళ్ళకు ఆమెకు నోటికివచ్చాయి. మీరు సూక్తులు చదవటంతో తృప్తి చెందకుండా వాటిని వాటిలో ఇమిడి ఉన్న అర్థాన్ని మననం చేస్తూ నిత్య జీవితంలో ఆచరించండి. ఆచరించక మొదట జారి పోవడం జరుగుతుంది. అప్పుడు నిజమైన హృదయ పూర్వకమైన బాధతో బాబాను అర్థిస్తే వారే మనకు సహాయం చేసి ఆ బోధలు ఆచరణ యోగ్యం చేస్తారు. మనం ఆచరించలేని కాలములో కూడా ఆ సూక్తి చదివినపుడు, మననం చేసినపుడు తప్పక మన హృదయములో కలుక్కుమనే బాధ వ్యక్తమవుతుంది. ఎందుకు ఆ సూక్తి ఆచరించలేక పోయామే అని సూక్తులు వల్లిస్తూ కూడా నిత్యజీవితంలో మనం ఆచరిస్తున్నామా లేదా అనే విచక్షణ ఆత్మ విమర్శ లేకుంటే మనకు దక్కేది సున్నా మాత్రమే. ఆచరించ లేకపోయినా ఆత్మ విమర్శ ఆచరించేటట్లు చేయమనే ప్రార్థన వలన మనకు కొంతలో కొంత మేలు జరుగుతుంది. గనుక శ్రీ స్వామి వారు మీకు చక్కని మార్గం చూపారు. ఆ మార్గాన పయనించి గమ్యం చేరండి.

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య

రెండు గుంజలు భూమిలో పాతి ఉన్నారు. ప్రతి నిత్యం ఒక గుంజను కాస్త కదిలించి దానిని భూమి నుండి పెరికే ప్రయత్నం చేసి వదిలేస్తూ అలా కొన్నాళ్ళు చేశామనుకోండి. మరియొక గుంజను అసలు తాకలేదనుకోండి కొన్నాళ్ళయ్యాక కదిలించుచున్న గుంజ సులభంగా ఊడి వస్తుంది. పెరికి వేయవచ్చు. రెండవ గుంజ కదిలించలేదు గనుక ఊడిరాదు. మన దోషాలు కూడా అంతే. నిత్యం హృదయములో కలుక్కుమని ఒకనాటికి అవే మన నుండి దూరం అవుతాయన్నమాట. అది మాష్టరుగారి వివరణ.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

గొలగమూడి
11-06-2002

చిరంజీవి సాయి సుబ్రమణ్యం గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం work allot చేసారని విన్నందుకు చాలా సంతోషం మాస్టరు గారు అంటారు చేసే వాళ్ళను చూస్తే బాబా ఇంకా ఇంకా పనులు ఇస్తూనే ఉంటారు. అయితే మనం దానిని ఒక ఛాలెంజ్‌గా తీసుకొని బాబా మెప్పు పొందేంతగా చేయాలి. పనిని చూసి విడవకూడదు. అదే బాబా సేవ అంతేగాని కర్పూర హారతులు మాత్రమే కాదు అని చెప్పేవారు. విద్యానగర్ మందిర నిర్మాణమప్పుడు పవళింపు హారతికే పోగలిగేవాణ్ణి. ఉదయం వేకువ నుండి క్యూరింగ్‌కు నీరు పోయాలి. 10 గంటల తరువాత కూలీలకు, పిల్లలకు అన్నం కూర సిద్ధం చేయాలి. కనీసం 3 సార్లు 3 x 4 kg వండాలి. పెద్ద అండా లేదు. అన్నాలు తిన్నాక బొచ్చులు తోముకోవాలి. 3 గంటల నుండి 5 గంటల వరకు మరలా curing కు నీరు - 5 గంటల తర్వాత మరలా వంట పని వడ్డింపులు ఇక హారతులకెప్పుడు హాజరయ్యేది. ఆ మహానుభావుడు ఎందుకో గాని నన్ను మాత్రం హారతులకు రావడం లేదేమి? అని అడగలేదు. పనిలో involve అయ్యాక తీరిక లేదు. ఆయన పని అనే పరిశుద్ధమైన ఎరుకతో project work కష్టమని ఎప్పుడు తలవవద్దు. అదే వారి సేవ అని ద్విగుణీకృతమైన ఉత్సాహంతో వారికి నమస్కరించి చేస్తూ ఉండు. ఆయనే నడిపిస్తాడు. <u>అందరికంటే గొప్పగా వారి కృప పొందాలన్న ఒక్క ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి</u>. ఇష్టమున్నా, లేకున్నా, తప్పుగానైనా, సంక్షిప్తంగానైనా పూజ, పారాయణం ప్రార్థనలు మానకుండ చేస్తుండు exercise regular గా చేయి. Just to keep up your body in tune with your work. తాత గారు చెప్పినవన్నీ అవసరం లేదు.

శివ వ్రాసిన లెటర్ నిన్న చేరింది. అందులో హైదరాబాద్ అడ్రస్ లేదు. అది బెంగుళూరు నుంచి వ్రాశాడు గదా? హైదరాబాద్ postal address ఇవ్వు. ఇంత late అయ్యేందుకు కారణం ఒకటే. పొరపాటున శివ అడ్రస్ అంతా తెలుగులో వ్రాశారు. Pin code వేయలేదు. గనుక sorting లో పక్కన పడేసి తెలుగు తెలిసిన వారి కొరకు wait చేయవలసి వచ్చి late అయింది. పిన్ కోడ్ ఉన్నా త్వరగా వచ్చి ఉండును. హైదరాబాద్‌లో శివ అడ్రస్ ఇవ్వు. తీరిక దొరికినప్పుడు మరల వ్రాస్తాను.

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా మీకుండాలని ప్రార్థిస్తూ,
పెసల సుబ్బరామయ్య

శ్రీ దర్గా స్వామి వారు చెప్పినట్లు సాయి సాయి అనుకుంటూ ఎక్కువ పనులు వంట, స్నానం travel-latrine లో వగైరా చేస్తూండు.

శ్రీ బ్రహ్మం గారి మఠంనకు పంపిన cheque చేరినది. బెంగుళూరులో మీ area pincode వ్రాయి.


గొలగమూడి
22-09-1994

పూజ్యగురు బంధు D.లక్ష్మిగార్కి పె.సుబ్బరామయ్య నమస్కారములు. ఎప్పుడైన 95 సంవత్సరములు గానీ ఇంకా ఎక్కువగానీ గురుకృప కల్గడం తధ్యమన్న మాట గనుక మనకు బాధ భయం అక్కర లేదు. మార్గాన నడిచేందుకు హృదయ పూర్వకంగా ప్రయత్నిస్తుండడమే ముఖ్యము. "సద్గురు దర్బారు శరణమయ్యా" అనే మహామంత్రం మిచ్చి స్మరించమన్నారు. ఎంత చక్కని బాట. నిత్య నిరంతరం ఆ మహామంత్రాన్ని స్మరించి తరించండి. శ్రీ బాబా నామం చేయలేదే, శ్రీ వెంకయ్య స్వామి నామం చేయలేదే అనే బేధ భావం పెట్టుకోవద్దు - భగవంతునికి అనంతకోటి రూపాలు, అనంతకోటి నామాలూ. నామరూపాలు లేని భగవంతునికి మానవుడు కల్పించిన వయ్యారమిది. మీరు ఎలాంటి సందేహం లేకుండా ఆ మహామంత్రాన్ని శ్రద్ధ భక్తులతో స్మరించండి. ఎవరిదగ్గర ఇలా చేస్తున్నానని చెప్పవద్దు. ఆచరణ ముఖ్యము. అలా చేసి తరించమనవి.

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

గొలగమూడి
22-09-1994

పూజ్య గురు బంధువు చిరంజీవి తోంటెపు రాజకుమార్ గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు.

చాలా సంతోషము - మీ బాధ్యత శ్రీ దర్గాస్వామి వారు స్వీకరించారు. మీరు లైన్‌లో ఉంటే తప్పక గమ్యం త్వరలో చేరుతారు.

సాధన చేసుకుంటే (లేక) సాధన చేసుకుంటూ వెళ్ళినట్లయితే మూడవ నేత్రం వస్తుంది అన్నారు. చాలా సంతోషము. నీవు ఎలాంటి భయము బిడియము కుండా మనము మన కర్తవ్యం నిర్వహిస్తుంటే సర్వమూ ఒనగూడ గలదు. జీవితంలో ఒడుదుడుకులు తప్పవు. కానీ సద్గురునిపై భారముంచి నిబ్బరంగా, ధైర్యంగా ంటే ఆ గురుమూర్తే తప్పక ఒడ్డు చేర్చగలరు. మనం మానసికంగా బాధ పడుతుంటే వచ్చిన ఒడుదుడుకులు ఎటూ మనలను వదలిపోవుగదా. కనుక మామిడి ండులాగా ధైర్యంగా ఉంటే ఆధ్యాత్మిక బాటన మన గమ్యం సుగమమౌతుంది. పారాయణ, మననము, నిదిధ్యాసలు లేకుండా కేవలం పూజలు, అన్నదానాలు సుకుంటూ పోతే ఆధ్యాత్మిక పురోగతి ఉండదు. కేవలం పుణ్యం ఆర్జిస్తూ ఆ పుణ్యఫలమనుభవించను జీవిత సన్నివేశములు, భోగభాగ్యాలు, అనుభవాలతో జన్మలు ొర్లుతుంటాయి.

పూర్ణవిశ్వాసము మన వాటా కర్తవ్యం చేస్తుంటే ఆ సద్గురుమూర్తే సర్వము సమకూర్చగలరని విశ్వసించు.

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య.

గొలగమూడి
13-11-2002


Dear Siva!

నీ లెటరు చేరింది. శ్రీ నాంపల్లి బాబాగారు స్వప్నదర్శన మిచ్చి మాట్లాడారంటే భౌతిక దర్శనంతో సమానమే. తొణుకు బెణుకూ లేకుండా భగవంతుడు నీకిచ్చిన పని చక్కగా చేస్తూపోవడమే మార్గము. తొందరపడి భగవంతుడు మనకిచ్చిన పని చేయడంలో అశ్రద్ధ చూపకూడదు. ఇంత గొప్ప సృష్టిలో మన పాత్ర మనం చక్కగా నిర్వహించేటట్లు మొదట చూచుకోవాలి. ఆధ్యాత్మికత పేరుతో నేడు లోకంలో జరిగే విశృంఖలత గుర్తుంచుకో. శ్రీ స్వామి వారు నిన్ను సర్వదా కాపాడాలని ప్రార్థిస్తూ,

మీ
పె. సుబ్బరామయ్య.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

గొలగమూడి
24-09-1994

పూజ్యగురుబంధు శ్రీమతి G. లక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. ఉభయకుశలోపరి. ముఖ్యంగా ఈ లెటర్ వ్రాయడం, మీరు మా ఇంటిలో పాడిన రెండు పాటలు దయచేసి క్యాసెట్ చేసి పంప మనవి. క్యాసెట్లు వెల ఎంతైతే అంత పంపుతాను. తప్పకుండా చేసి పంపుతారని విశ్వశిస్తున్నాను. Registered post లో పంప ప్రార్థన.

మాష్టరుగారితో జరిగిన సంభాషణలు మీలాంటి వారితో ఎడతెగకుండా చెప్పాలని ఉంటుంది. ఒక సన్నివేశంలో మాష్టరు గారు అంటారు, అనడమే కాకుండా పుస్తకంలో వ్రాశారు ఎక్కడైనది గుర్తురావడం లేదు.

"అందరూ ముక్తి కెళ్ళాక చివరివారు నన్ను తనవెనుక రానిస్తే చాలు", ఇదే మాటను వివేకానందుడు మరొక విధంగా అంటారు. "భారతదేశంలో ఒక్కరు ముక్తి చెందుతారంటే వెయ్యి జన్మలైనా హీన జన్మ లెత్తుతాను (కుక్క, వగైరా) "తన స్వార్థం చూచుకోవడం ఎంత హీనము. ఇతరుల శ్రేయస్సు కొరకు పాటు పడ్డప్పుడు భగవంతుడెంత సంతోషిస్తాడు!". ఇందు మూలంగానే ఒక్క సంవత్సరం రోజులు నన్ను మా కలిచేడు గ్రామంలో శ్రీ రామాలయంలో రాత్రి ప్రతినిత్యం సాయి లీలా మృతం చదువమని చెపుతూ వచ్చారు. శ్రీ స్వామి వారికి దర్శించమని చెప్పినట్లుగానే. కానీ నేనీ రెండు పనులు ఒక్క సంవత్సరం చేయకుండా మూర్ఖంగా ప్రవర్తించాను. అయితే ఆ కరుణా మయుడు పట్టువీడని విక్రమాదిత్యుని వలె చివరకు ఎందుకు చదువవు? నీకు ఇబ్బంది ఏమిటి అని నిలదీశారు. అప్పుడు నా ఇబ్బంది చెప్పకతప్పలేదు.

<u>ఏమిటి</u>: శ్రీ రామాలయంలో పుస్తకం పట్టుకొని కూర్చున్నది మొదలు కొంటే వారు ఏవో ప్రశ్నిస్తారు. వాటిని నేను చెప్పే సమాధానాలు చాలవు - వారికి నాకు వాదన వస్తుంది. ఇంట్లో చదువుకుంటే ఆ బాధ లేదుగదా.

<u>మాష్టరుగారు</u>: ఓస్, దీనికా ఇన్ని రోజులు జాప్యం చేశావు. ఎవరే ప్రశ్న లేపినా వెంటనే నీవు ఎదురు ప్రశ్నవేయి.

<u>ఏమని</u>: నీవు హృదయపూర్వకంగా అడుగుతున్నావా, ఆ ప్రశ్న?

అని అవునంటే వెంటనే సాయి లీలామృతం గ్రంధం వారి చేతికిచ్చి నీ ప్రశ్నకిందులో సమాధానముంది. మొదటి నుండి చివరి వరకు చదువు తెలుస్తుందని చెప్పు. అలా చదివి కూడా ఇంకా ప్రశ్నిస్తుంటే చార్జీలు నేను భరిస్తాను. నాదగ్గరకు తీసుకురా. శ్రీ సాయి లీలామృతం అతడు పోగొట్టాడంటే నేను నీకు మరొకటిస్తాను. ఈ విధంగా నాచేత శ్రీ రామాలయంలో సత్సంగానికి నాంది పలికి కలిచేడులో శ్రీ సాయినాధుని మందిరాన్ని ప్రారంభించి ఎందరికో వెలుగు చూపుతున్నారు. ఆ మందిరంలో సాయి నిలువడం ఎందరికి అండ అయిందో చెప్పలేను.


నాలాగ మీరు ఒక్క సంవత్సరం వెనుకాడకుండా సత్సంగం చేస్తున్నారంటే మీరెంతో అదృష్టవంతులు, నిజంగా. సత్సంగానికి వెళ్ళాకనే నా అవగాహన, Attitude to wards others and the world మారింది. గనుక మన సత్సంగం మన పురోభివృద్ధికే గాక సాటివారి కొరకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నైమిశారణ్యమునులే ఎంతో మహా తపస్వులై ఉండి కూడా నిత్యం మహనీయుల చరిత్ర పారాయణ, శ్రవణం చేస్తుఉండినట్లు భాగవతంలోను, భారతం లోనూ తెలుస్తుంది. ఇలాంటి మహత్తరమైన సత్సంగం మన కిచ్చిన మాష్టరుగారి ఋణం ఎలా తీర్చుకోగలము?

వారు అన్నానికి జరుగని పరిస్థితిలో కూడా మన నుండి ఏమి ఆశించారు. మీరెక్కడుంటే అక్కడ సత్సగం చేయండి. అది నాకు పదివేలన్నారు. కానీ డబ్బు ఇవ్వమని అడుగలేదు. గనుక శ్రీ మాష్టరు గారి కోరిక ఆశయం పూర్తి చేస్తూ ఉన్నమీరు అదృష్టవంతులు.

మరొక రోజు నేను వారిని ఒంటరిగా మరొక మాట అడిగాను. సార్! ధ్యానం ప్రపంచం తెలియకుండా చేయడం నాకు ఎప్పుడు కుదురుతుంది. అందుకు వారన్నారు. అది మనకెప్పుడెందుకు. దానిని మన కెప్పుడివ్వాలో శ్రీ సాయినాధునికే తెలుసు. బండి రైలు track మీద ఉంటే ఎప్పుడైనా గమ్యం చేరుతుంది. తొందరెందుకు. ఒక పండు చెట్టునే పండితే ఎంత తీపీ ఉంటుంది? అలాకాకుండా కాయకోసి పొగవేసి మాగ వేస్తే ఎంత తీపీ ఉంటుంది? గనుక మనం క్రమంగా పండాలి. అంతేగానీ తొందరెందుకు. శ్రీ సాయినాధుని చేతిలో పడ్డాక ఇక మనకు కొదువేమిటి? తన కప్పుచెప్పబడ్డ ప్రతి పైసాను భగవంతునికి వప్పుచెప్పను అని ప్రతిజ్ఞపూనిన ఆ మహనీయునికి చెందిన మనకు భయమేమిటి. దాంతో మరలా వారినెన్నడూ అడుగలేదు.

మాష్టరుగారు వివాహం చేసుకోనని గట్టిగా పట్టారు, కానీ ఋణానుబంధాలు తీరాలని లేకుంటే ముక్తికి అడ్డమని సాయినాధుడు వారికి వివాహం చేశారు. అయినా వారి స్థితికి, సాధనకు వివాహం, కుటుంబం అడ్డువచ్చారా? ఎంతో మంది మిత్రులను ఉన్నత స్థితికి తీసుక వెళ్ళారు. సత్సంగమే లేకుంటే వారేమీ చేయగలరు ఇతరులకు?


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

విద్యానగర్‌లో వారు చేసిన ప్రార్థన మహా అద్భుతమైనది గదా? "బాబా! నాకు సత్సంగమైనా ప్రసాదించు లేక అది దొరికే చోటుకైనా నన్ను తీసుకువెళ్ళు" అని. అనతి కాలంలో వారి ప్రార్థన మన్నించబడి ప్రపంచమంతా వారికి సత్సంగమైంది. వారి గ్రంథాలు వెళ్ళిన దేశాలంతా వారికి సత్సంగాలే గదా. అట్టి మహద్భాగ్యం నాకు, మీరు కల్గించిన శ్రీ మాస్టరుగారికి సాష్టాంగ దండప్రణామములర్పిస్తాను.

మీరు సత్సంగంలో ఎంతోసేపైనా ఉండగలిగితే సరి. మీకు గృహనిర్వహణ ఒక డ్యూటి గనుక నాలాగ ఉండలేరను కుంటాను. కలిచేడులో ఒక్కొక్క రోజు ప్రశ్నలమూలకంగా నేను 8 నుండి 1 గం వరకూ ఇంటికి వచ్చేది లేదు. మీరలా ఉండలేరు గనుక ప్రశ్నలకు వారంలో ఒకటి రెండు రోజులు కేటాయించుకొని మామూలు పారాయణ, భజన, ప్రసాద వినియోగం అయ్యాక ఒక గంట ప్రశ్నోత్తరములకు పెట్టుకుంటే చాలా బాగుంటుందని నా అభిప్రాయము. Discussion లేకుండా మనం అభివృద్ధి సాధించినా అది చాలా స్వల్పముగు తుందని మాస్టరుగారి అభిప్రాయము. అందుకే వారు ఎప్పుడు సత్సంగం చేసినా one way traffic గా లేకుండా ప్రశ్నలకు కూడా freedom ఇచ్చేవారు. మనం కూడా అలా చేసుకుంటే వారి అడుగు జాడలో నడచి, వారి ఆశయానికి మనవంతు కృషి చేసి మనం వారికి సంతోషం కలిగించగలమని ఆశిస్తున్నాను.

శ్రీ దర్గా స్వామి వారితో మీ అందరి అనుభవాలు విన్నాక మాస్టరుగారి సత్సంగ మెంత అభివృద్ధి సాధించిందో చూచి చాలా సంతోషమైనది. ఇంతకు ముందు నెల్లూరు నుండి ఒక గ్రూపు వెళ్ళి "ఆయన ఒక మామూలు వ్యక్తి" నని చెప్పారు. అది శ్రీ K.V. రంగారావు గారి మాటకు వ్యతిరేకముగా ఉంది. ఇప్పుడు మీ అనుభవాలు విన్నాక ఆ స్వామి వారి సర్వజ్ఞత్వం, సర్వసమర్థత్వం, సర్వవ్యాపకత్వం తెలియ వచ్చింది.

మీ సత్సంగమునకు శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని శ్రీ స్వామి వారిని ప్రార్థిస్తూ,

మీ సత్సంగీయులందరికీ నమస్కారములు చెల్లిస్తున్నాను. మీరందరూ శ్రీ దర్గాస్వామి వారి దర్శన భాగ్యము పొందారు. వారి ఆశీస్సులు మీకందరికీ ఉన్నాయి. అందునా మీది "మార్జాల కిశోర న్యాయము" ఎంత గొప్ప అదృష్టమో గదా! ఓం సాయినాథాయ నమః

నమస్కారములతో
పె.సుబ్బరామయ్య

**శ్రీ శ్రీ శ్రీ దర్గా స్వామి వారితో భక్తుల అనుభవాలు :**

శ్రీ దర్గాస్వామి వారు శిధిలమైన బ్రహ్మం గారి మందిరం చూస్తే ఆ మఠం పునరుద్ధరణ పని త్వరగా అవుతుంది అనే ఉద్దేశం తో శ్రీ సుబ్బరామయ్య సార్ (సార్) అప్పుడు గొలగమూడిలో కళ్యాణ మందిరం శంఖుస్థాపనకు విచ్చేసిన శ్రీ దర్గా స్వామి వారిని, “స్వామి మీరు ఒక్క మారు శిధిలమైన బ్రహ్మం గారి మఠం ప్రాంగణం లో పాదం మోపి వెళ్ళండి” అని అభ్యర్థిస్తారు. శ్రీ స్వామి బ్రహ్మంగారు మా గురువు అని, వస్తానని విచ్చేస్తారు. వారి సంభాషణ ఇలా జరిగింది :

**స్వామి:** ఇచ్చట ఏమి వేద్దామని అనుకుంటున్నావు ?

**సార్ :** బ్రహ్మగారిని కూర్చో బెట్టి నాలుగు రేకులు తెచ్చి వేద్దామని లేదా తాటాకులు తెచ్చి పాకలా వేద్దామని.


**స్వామి :** ఏమి ? నీవు మిద్దె ఇంట్లో ఉంటూ ఆయనకు రేకులు వేస్తావా ?

**సార్ :** నాకు శక్తి లేదు స్వామి !

**స్వామి :** తలోక పువ్వు వేస్తె మాల అవుతుంది. రసీదు పుస్తకాలు వేసి పంపు. అవసరమైన డబ్బులు అవే వస్తాయి.



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

స్వామి అలా చెప్పటమే కాక అప్పటికి అప్పుడు భక్తులను విరాళాలు ఇవ్వమని ప్రోత్సహించటం ద్వారా 25,000 రూపాయల దాక సేకరించి ఇచ్చారు. అలా ఆ పుణ్య కార్యానికి అంకురార్పణ చేశారు.

శ్రీ సార్ కు రసీదు పుస్తకాలు తో విరాళాలు సేకరించటం లో ఇది వరలో వున్న bitter experiences వల్ల రసీదు పుస్తకాలు వెంటనే అన్ని చోట్లకు పంపలేదు. దర్గాస్వామికి ఏమి చెప్పలేదు. చెప్పలేని పరిస్థితి. దర్గాస్వామి వద్ద నుండి గొలగమూడికి వచ్చే భక్తులందరి చేత స్వామి "సుబ్బరామయ్యకు రసీదు పుస్తకాలు వేసి పంపమని చెప్పు, ఎందుకు రావో చూస్తాను" అని చెప్పి పంపేవారు. రెండు మూడు సార్లు స్వామి సార్ మనసులోని భావానికి సమధానంగా అలా చెప్పి పంపటంతో అలానే రసీదు పుస్తకాల ద్వారా విరాళాల సేకరణ ఆరంభించారు.

సార్ మనసులోని భావము స్వామికి ఎలా తెలిసింది. స్వామి సర్వ భూత హృదయంతర్వార్తి, సర్వవ్యాపి అయిన దైవం కాకుంటే?

సార్ రసీదు పుస్తకంతో ఊరి పెద్ద మనిషి వద్దకు వెళతారు. ఆయన విరాళం ఇవ్వలేదు సరికదా, "మందిరాలు కడతారు - దీపం పెట్టే దిక్కు ఉండదు" అని విమర్శిస్తారు. సార్ ఊరుకున్నారు.

స్వామి అప్పటి నుండి గోలమూడి వచ్చే భక్తులతో "దీపం పెట్టే దిక్కు ఉండదు" అన్నారు ఎలా ఉండదో చూస్తాము. త్వరగా పని కానివ్వండి అని చెప్పి పంపుతుండేవారు.

సార్ -ఆ పెద్ద మనిషికి మధ్య మాత్రమే జరిగిన సంభాషణ స్వామి కి ఎలా తెలిసింది ? స్వామి సర్వజ్ఞుడు, సర్వవ్యాపి అయిన దైవం కాకుంటే ?

స్వామి కృప వల్ల ఒక భక్తుని తల్లికి కాన్సర్ నయం కావటంతో అతను స్వామికి పెద్ద మొత్తం విరాళం ఇవ్వ దలచుకుంటే స్వామి పోయి గొలగమూడిలో బ్రహ్మం గారి మఠం చూడమన్నారు. అతను స్వామి ప్రేరణగా ఆ విరాళం బ్రహ్మం గారి మఠం నిర్మాణానికి ఇస్తారు. ఇలా సార్, స్వామి కలసి చేసిన భగవత్ కార్యము అది.

స్వామి "తలోక పువ్వు వేస్తే మాల అవుతుంది" చెప్పినట్లు స్వామి తో మనకు గల అనుభవాలను పంచుకుందాము.


**సాయి సుబ్రహ్మణ్యం,**తిరుపతి : తనకు శ్రీ దర్గాస్వామి వారితో గల అనుభవాన్ని ఇచ్చట పంచుకుంటున్నాడు.

బెంగుళూరులో చదువుకునేటప్పుడు శ్రీ దర్గా స్వామి వారిని తరచు దర్శించుకోవటం, స్వామికి ఫోన్ చేయటం కూడా అలవాటుగా ఉండేది. ఒక సమయంలో మా నాన్న గారు నాకు ఉపనయనానికి మా ఊరిలో శాస్త్రిగారు చెప్పిన ఒక ముహూర్తంకు చేసుకోవచ్చునని చెప్పారు. ఆ రోజు రాత్రి శ్రీ దర్గా స్వామి వారికి ఫోన్ చేసి వారి ఆశీస్సులకై ప్రార్ధిద్దామని STD Booth నుండి ప్రయత్నిస్తే ఫోన్ కలవలేదు. కానీ ఆ రోజు రాత్రి శ్రీ దర్గా స్వామివారు స్వప్నంలో కనిపించారు. నేను ఆత్రుతగా "స్వామి ఫలానా రోజు నా ఉపనయనానికి ముహూర్తం

బాగుందట" అన్నంతలోనే స్వామి "అది అంత బలమైన ముహర్తం కాదు. మామూలుగానే ఉంది" అన్నారు. మరురోజుకు నాకు కల గుర్తు ఉన్నా మా నాన్నగారికి ఏమి చెప్పలేదు. స్వామికి కూడా మరల ఫోన్ చేయటం వెంటనే కుదరలేదు. రెండు మూడు రోజులలో మా నాన్న గారు ఫోన్ చేశారు. ఏమని ? ఆ ముహర్తం పెట్టిన శాస్త్రి గారు వారంతట వారే వచ్చి ముందు పెట్టిన ముహర్తం లో తార కలసింది, కాని నక్షత్రం - గ్రహం కలవలేదని. అది మరి గొప్ప ముహర్తం కాదని చెప్పారట. ఆ ముహూర్తానికి ఉపనయనం జరగలేదు. శ్రీ స్వామికి ఫోన్ చేద్దాము అనుకున్నంతనే, మనస్సులో విన్నవించు కున్నంతనే స్వామి మనకు ఆశీస్సులు ఇవ్వటమే కాక, అందులో ఏ లోపం ఉన్న సరి చేయుటకు సర్వ సమర్ధుడు, సర్వ ప్రేరణాధికారి అయి శాస్త్రిగారిని మరల చూసేట్లు చేసి, మా నాన్నగారికి చెప్పేట్లు చేసి, నాకు చెప్పించి, వారి స్వప్న దర్శనం భ్రమ కాదని తెలిపి నా మంచి నేనడగకనే చేశారు. తరువాత మరో ముహుర్తానికి "గొలగమూడి లో ఉపనయనం చేసుకొందామనుకున్నాను" అని శ్రీ స్వామికి చెబితే ఉపనయం అయ్యాక స్వామి వద్దకు రమ్మని ఎంతో ప్రేమతో ఆశీస్సులు ఇచ్చారు.

శ్రీ దర్గాస్వామి వారు గొలగమూడి కళ్యాణ మందిరానికి, శ్రీ వెంకయ్యస్వామి వద్దకు వచ్చారు. శ్రీ దర్గాస్వామి వారు గొలగమూడిలో ఉన్నారని తెలిసి కూడా ఆ సందర్భంలో వారి దర్శనానికి నేను, మా అమ్మగారు వెళ్ళలేదు. స్వామి అంతకు ముందు చెప్పినది ఏమో అర్థం కాలేదని స్వామి ఏమంటారో అన్న ఒక సందిగ్ధావస్త! అవసరమైనది స్వామి, శ్రీ సుబ్బరామయ్య సార్ చేయిస్తారు అనుకుని ఉన్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ ఇంటివద్ద బయట ఉన్నాను. సార్ బయటకు వచ్చి శ్రీ దర్గాస్వామి వద్దకు బయలుదేరుతూ నాతో "దర్గాస్వామిని దర్శించుకున్నావా?" అని అడిగారు. లేదు సార్ అన్నాను. సార్ నవ్వుతూ "నడు, నడు, నీకు తలపై (దర్గా స్వామి) దండం పెట్టించాలి, తట్టించాలి" అని నన్ను కూడా తీసుకువెళ్లారు. హాలు అంతా కిక్కిరిసి ఉన్న స్వామి వద్దకు సార్ వెళుతూ నన్ను తీసుకోని (లాక్కొని) వెళ్లారు. స్వామి ముందు కూర్చోపెట్టి స్వామితో "స్వామీ! సాయికి ఆరోగ్యం బాగుండటం లేదు" అన్నారు. శ్రీ దర్గాస్వామివారు వారి దండం నా తలపై పెట్టి తడుతూ "ఏమి లేదు ! ఆలోచనలే ! తీసేసుకుంటే అంతా బాగుంటుంది. అంటూనే భగవంతుడిని శరీరంలో (గుర్తిస్తే) ఉంటే ఇంక రోగం ఉండదు." అన్నారు. స్వామితో కొద్ది సంభాషణ అయాక సార్ నన్ను బయటకు తీసుకు వచ్చి కూర్చోపెట్టి "ఏమి లేదట ! ఏమి లేదట ! ఆలోచనలే అట. ఆలోచనలు తీసేసుకుంటే అంతా బాగుంటుంది అట (స్వామి అంటున్నారు కదా )" అన్నారు. సార్ మనో భావానికి , స్వామి క్రియ, మనో భావాలకు అభేదం ఈ అనుభవంలో తెలిపి ఆ మహాత్ములిద్దరికి భేదం లేదని, వారిరువురు కలసి భక్త రక్షణ, మనను శుభ్రమార్గంలో పెట్టి నడిపించటం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ ఆలోచనలకు కారణం ఆశ, ఇష్ట, అయిష్టాలు, పైగా అలవాటు అని సార్ తెలిపినా వానిని


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

పలచబడే ప్రయత్నమైన చేయగల శక్తిని ఇమ్మని ఆ ఇరువురు మహాత్ములను హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను.

**నాగేష్ .K , బెంగుళూరు**

అప్పటికి నాకు శ్రీ దర్గాస్వామి వారి గురించి ఏమీ తెలియదు. శ్రీ దర్గాస్వామి వారు గొలగమూడిలో ఆశ్రమం వారి గదులలో ఉన్నారు. శ్రీ సుబ్బరామయ్య సర్ నన్ను రమ్మని శ్రీ దర్గాస్వామి వారి దగ్గరకు తీసుకుని వెళ్లారు. స్వామి వారికి నమస్కరించు కోమని వారికి నా ఎగ్జామ్స్ గురించి చెప్పారు. స్వామివారు నా గురించి అడిగి ఆశీస్సులు ఇప్పించేటట్లు చేసారు.


సర్ శ్రీ స్వామివారి గురించి చాలా గొప్పగా చెప్పేవారు. రామకృష్ణ పరమహంస వారికంటే కూడా గొప్పవారని చెప్పేవారు. ఎలా అంటే, శ్రీ రామకృష్ణ పరమహంస వారి ఇంద్రియనిగ్రహం మనుషుల మధ్య నివాసం చేస్తూ సాధించారు. కాని శ్రీ దర్గాస్వామి వారి జీవనం అడవిలో.ఎవ్వరూ గమనించని, నియంత్రించని స్వేచ్ఛా ప్రదేశాలలో ఉంటూ కఠోరమైన నియమ పాలన చేయడం ఎంతో కష్టమైనదనేవారు. సార్ దగ్గరకు వచ్చే వారికి శ్రీ దర్గాస్వామి వారిని దర్శించమని ప్రోత్సహించేవారు.

శ్రీ దర్గా స్వామి వారిజీవనం లో మనం ఈ క్రింది విషయాలను గమనించవచ్చు.

1. ఎప్పుడూ భయం, దీనత్వం ఎరుగరు.
2. చివరి వరకూ కఠోరమైన నియమపాలన చేయటం
3. పరిపూర్ణమైన నిష్కామ సేవ
4. దివ్యమైన, మహోన్నతమైన జీవనం
5. భక్తులకు ఆశ్రయం కల్పించటం, పిల్లలకు స్కూల్ ద్వారా విద్యను అందించటం.
6. చివరి వరకూ క్రమం తప్పకుండా నిత్యం హారతులు, పూజలు చేయటం
7. బ్రహ్మానుభూతి కలిగిన మహాత్ములైనా అందరిలో కలసిపోవటం
8. అందరిలో ఒకే పరమాత్మ ఉన్నారన్న భావాలు పంచటం
9. తమను ఆశ్రయించే వారికి నిరంతరం గమనిస్తున్నామనే నిదర్శనాలు ఇచ్చి కాపాడటం
10. అద్భుతమైన బ్రహ్మవర్చస్సు



శ్రీ షిర్డీ సాయిబాబా



శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి




శ్రీ దర్గాస్వామి

# మా ఇతర ప్రచురణలు

## భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి గ్రంధములు

| | | |
|---|---|---|
| 1. | అవధూత లీల (తెలుగు) – (శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర నిత్య పారాయణ గ్రంధము) | 40 /- |
| 2. | అవధూత లీల (తెలుగు బౌండ్ పుస్తకము) | 60 /- |
| 3. | అవధూత లీల (తమిళం) | 50 /- |
| 4. | అవధూత లీల (ఇంగ్లీష్) | 30 /- |
| 5. | అవధూత బోధామృతం (శ్రీ స్వామివారి బోధలు) | 15 /- |
| 6. | శ్రీ స్వామి సన్నిధి (శ్రీ స్వామివారి సేవకుల అనుభవాలు) | 15 /- |
| 7. | చూచి నేర్చుకో | 15 /- |
| 8. | శ్రీ వెంకయ్య స్వామి అరవం చిన్న పుస్తకం | 5 /- |
| 9. | అవధూత లీల (ఇంగ్లీష్ చిన్న పుస్తకము) | 5 /- |
| 10. | గురుస్తుతి | 9 /- |
| 11. | శ్రీ వెంకయ్య స్వామి ఆరతులు | 5 /- |
| 12. | బోధ యజ్ఞాయ నమః | 4 /- |
| 13. | శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ | 4 /- |
| 14. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి హిందీ **చిన్న పుస్తకం** | 3 /- |
| 15. | మౌన బోధ | 3 /- |
| 16. | పిలిచిన పలికే దైవం | 3 /- |
| 17. | ధర్మమూర్తి | 3 /- |
| 18. | దివ్య లీలలు | 3 /- |
| 19. | శ్రీ స్వామి కృప | 3 /- |
| 20. | శ్రీ స్వామి వారి భజన పాటలు | 3 /- |
| 21. | నమ్మలేని పచ్చి సత్యాలు | 3 /- |
| 22. | వెన్నెల **పువ్వులు** (శ్రీ వెంకయ్యస్వామి వారి దివ్య**త్వం**) | 3 /- |
| 23. | స్మృతి మాత్ర ప్రసన్నాయ నమః | 3 /- |
| 24. | స్మృతి రహిత ప్రసన్నాయ నమః | 3 /- |
| 25. | సర్వసమర్థుడు | 3 /- |
| 26. | వాళ్ళుండే దాన్నిబట్టి గదయ్యా మన**ముం**డేది! | 3 /- |
| 27. | స్వామి అనుగ్రహము | 3 /- |


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

## శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టారి గ్రంథములు

| | |
|---|---|
| 28. శ్రీ మాస్టారు గారి బోధామృతం<br>(నాకు తెలిసిన మాస్టారు 1, 2 భాగములు, శ్రీ మాస్టారి మంచి మాట) | 40 /- |
| 29. శ్రీ భరద్వాజగారితో భక్తుల అనుభవాలు | 4 /- |
| 30. మృత్యువుపై ఘన విజయము | 4 /- |
| 31. శుద్ధ చైతన్యమే తానైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్ గారు | 4 /- |
| 32. అమృత వాక్కులు | 3 /- |
| 33. మన ధర్మము కర్తవ్యము | 4 /- |

## ఇతర మహనీయుల గ్రంథములు

| | |
|---|---|
| 34. జ్ఞానేశ్వరి భగవద్గీత | 210 /- |
| 35. వార్తాలాపము **(రెండు పుస్తకములు)** | 150 /- |
| 36. శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15 /- |
| 37. శ్రీ శివ నేశన్ స్వామీజీ దివ్య చరితము | 12 /- |
| 38. శ్రీ బూర్లె రంగన్నబాబు గారి దివ్య చరిత్ర | 10 /- |
| 39. శ్రీ పుండీ స్వామి వారి దివ్య చరిత్ర | 5 /- |
| 40. నెల్లూరు శ్రీ యర్ర దర్గాస్వామి వారి దివ్య చరిత్ర<br>(శ్రీ సయ్యద్ అహ్మద్ బాబా గారి దివ్య చరిత్ర) | 5 /- |
| 41. మంత్రం ఎక్కడుంది? తంత్రం ఎక్కడుంది?<br>(శ్రీ మాధవదాసు గారి దివ్య చరిత్ర) | 5/- |
| 42. దైవం మానుష రూపేణ (సద్గురు శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి గారి దివ్య చరిత్ర) | 50 /- |
| 43. శ్రీ నల్ల మస్తాన్ బాబా గారి దివ్య లీలలు | 5 /- |
| 44. శ్రీ నాంపల్లిబాబా గారి దివ్య లీలలు | 7 /- |
| 45. శ్రీ మాయి అమ్మ | 4 /- |
| 46. శ్రీ నరోపా గారి జీవిత చరిత్ర | 3 /- |
| 47. శ్రీ కృష్ణయ్య స్వామి వారి దివ్య చరిత్ర, ప్రొద్దుటూరు | 3 /- |
| 48. శ్రీ శ్రీ శ్రీ సుధీంద్ర బాబు గారు | 3 /- |
| 49. శ్రీ జ్ఞానేశ్వర మహరాజ్ చరిత్ర | 3 /- |

## సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ గ్రంథములు

| | |
|---|---|
| 50. శ్రమతో సేవ - సేవతో కైవల్యం | 5 /- |
| 51. పరోపకారార్థ మిదం శరీరం (సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత చరిత్ర) | 6 /- |